శ్రీ యస్.కె.నరసింహారావు, ఐ.ఎ.ఎస్.
రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్
జిల్లా ప్రాథమిక విద్యా పథకం

## ఓ మాట...

నేర్చుకోవడం జీవితం నుండి వేరైన నాటి నుండి 'చదువు' మొదలయ్యింది. ఈ చదువు ఉన్న వారికీ, లేనివారికీ మధ్య విపత్కర దూరాలను ఉన్న వారిని అందలం ఎక్కిస్తూనే, ఇంకోవైపు విలక్షణతను ఒక్క ఒత్తిడం, మూసపోత మూస ఆలోచన విధానాన్ని ప్రోత్సహిస్తూ వస్తోంది. చదువును ఆసక్తికరంగా, సృజనాత్మకంగా, ఆనంద దాయకంగా, జీవితంతో సంబంధం గలదిగా మలచటానికి సమాంతరంగా అనేక ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఈ విషయంలో మన దేశంలో ఠాగూర్, గాంధీ, గిజుభాయి ఆలోచనలు ఎందరికో ప్రేరణగా నిలిచాయి. ఇలాంటి శాస్త్రవేత్తలు, విద్యావేత్తల గురించి, చదువులో ప్రయోగాల గురించి ఆరు పుస్తకాలను కూర్చి 'చదువులు - కొత్తదారులు' పేరుతో జనవిజ్ఞాన వేదిక, మంచి పుస్తకం కలిసి ప్రచురించటం సంతోషం. అన్ని వేళలా, అన్ని సందర్భాలలో పిల్లల పక్షాన ఉండటమే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చేయవలసిన పని అని ఈ పుస్తకాలు చెబుతాయి. ఇంకెందరో విద్యావేత్తలు, వారి ప్రయోగాలు ఇందులో చోటు చేసుకోవలసి ఉన్నప్పటికీ ఈ ప్రయత్నం చదువుతో ముడిపడిన వారందరికీ - విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పిల్లల బాగుకోరే వారందరికీ ఉపయోగకరంగా ఉంటుందని, ఆలోచనలకు ఊతమిస్తుందని ఆశిస్తూ...

హైదరాబాదు
సెప్టెంబరు, 2002

(యస్.కె.నరసింహారావు)



# చదువుల ప్రయోగాలు

అరవింద గుప్తా

అనువాదం: లావణ్య

జన విజ్ఞాన వేదిక
మంచి పుస్తకం



చదువులు - కొత్తదారులు-5
చదువుల ప్రయోగాలు: అరవింద గుప్తా (సంపాదకత్వం)
హిందీమూలం: ఆంఖోంకీ చమక్ (ఫుల్ ఝుడీ నుండి)
అనువాదం: లావణ్య
బొమ్మలు: అవినాష్ దేశ్‌పాండే
తెలుగులో ఈ పుస్తకమాల సంపాదకులు: కె.సురేష్
© కృతజ్ఞతతో: ఫుల్ ఝుడీ

కంపోజింగ్: ఆర్.జె. గ్రాఫిక్స్
చిక్కడపల్లి, హైదరాబాద్-500 020.
ఫోన్: 661 0373

ముద్రణ: చరిత గ్రాఫిక్స్
చిక్కడపల్లి, హైదరాబాద్-020.
ఫోన్: 760 7361

వెల: రూ. 7.00
ప్రచురణ కాలం: సెప్టెంబరు, 2002

ప్రచురణ, ప్రతులకు:
జన విజ్ఞాన వేదిక
జి.మల్యాద్రి, కన్వీనర్ ప్రచురణల విభాగం
162, విజయలక్ష్మినగర్
కొత్తూరు పోస్ట్, నెల్లూరు - 524 004.
ఫోన్: 0861-305303

మంచి పుస్తకం
'వాసన్', 12-13-452, వీధి నెం.1
తార్నాక, సికింద్రాబాద్ - 500 017.

జాతీయ సాక్షరతా మిషన్ సహాయంతో భారత జ్ఞానవిజ్ఞాన సమితి, న్యూఢిల్లీ ప్రజల చదువుల ఉద్యమం (జనవాచన్ ఆందోళన్) పేరుతో బాలల పుస్తకమాలగా దాదాపు 60 పుస్తకాలు ప్రచురించింది. గ్రామీణ ప్రజలు, పిల్లల్లో చదవటంపట్ల ఆసక్తి కలిగించటం ఈ పుస్తకాల ఉద్దేశం. వాటిల్లోనుంచి చదువులు, విద్యావేత్తలు, కొన్ని ప్రయోగాత్మక బడుల గురించిన ఆరు పుస్తకాలను ఎంపికచేసి 'చదువులు - కొత్తదారులు' పేరుతో ప్రచురిస్తున్నాం. ఈ ఆరు పుస్తకాలు ప్రత్యేకించి 'చదువు'కి సంబంధించి ఆసక్తి ఉన్న ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, తత్వవేత్తలు, కార్యకర్తలు, తల్లిదండ్రులను ఉద్దేశించి ప్రచురిస్తున్నాం.

# చదువుల ప్రయోగాలు



## అరవింద గుప్త



# కంటి మెరుపులు

మరియా మాంటిసోరీ ప్రపంచంలో పేరు పొందిన విద్యావేత్త. పిల్లలు ఆడుకోడానికి ఆమె "ఉత్తరాల డబ్బా" అన్న ఆటని తయారుచేసారు. ఉత్తరాల డబ్బా అంటే ఒక మూసి ఉన్న డబ్బాకి అన్నివైపులా రకరకాల ఆకారాలతో కిటికీలు ఉంటాయి – కొన్ని కిటికీలు త్రికోణం ఆకారంలో, కొన్నిగుండ్రంగా, కొన్ని చతురస్రాకారంలో ఉంటాయి. పిల్లలు గుండ్రటి ఆకారం గల బొమ్మను గుండ్రటి కిటికీలో "పోస్టు" చేయాలి!!

ఒక రోజు ఒక ఫాదరు బడికి వచ్చారు. మాంటిసోరీ ఆ ఫాదరుకి బడిని చూపిస్తూ పిల్లలు ఆడుకునే మూలకి తీసుకు వచ్చారు. అక్కడ ఒక నాలుగు సంవత్సరాల పాప "పోస్టడబ్బా"తో ఆడుకుంటోంది. పిల్లలు గోలగోలగా అరుస్తూ పాటలు పాడుతున్నారు. అయినా ఆ పాప తన ఆటలో మునిగిపోయి ఉంది. మాంటిసోరీ ఆ పిల్లని లేపి బల్లమీద కూర్చో పెట్టినా, తన ఆట మానలేదు. ఫాదరు ఒక బిస్కెట్ల డబ్బా తీసుకువచ్చాడు. అవి పిల్లలకి పంచుతూ, ఈ పాపకి కూడా ఇచ్చాడు. బిస్కెట్ని తీసుకోవాలా



వద్దా అని తటపటాయిస్తూనే పాప తీసుకుంది. దీర్ఘచతురస్రాకారం గల ఆ బిస్కెట్ని చూడగానే పాపకళ్ళలో మెరుపులు మెరిసాయి. చటుక్కున దాన్ని దీర్ఘచతురస్రాకారం కిటికీలో వేసేసింది.

ఆశ పెట్టో, లంచం ఇచ్చో పిల్లలు చదువుకోరు. ప్రపంచానికే కొత్త కాబట్టి, ప్రపంచాన్నే అర్థం చేసుకోవాలని చూస్తుంటారు. అందరి పిల్లల్లోనూ ఈ నాలుగు సంవత్సరాల పాప కళ్ళల్లోని మెరుపులు ఉంటాయి. కానీ, కొంతకాలానికే ఈ మెరుపు మాయమైపోతోంది. ✪

# కథల మాంత్రికుడు

లక్ష్మీశంకర్ మాష్టారుకి ఎంతో కంగారుగా ఉంది. పిల్లలు రోజంతా అరిచి గోల చేస్తూ, ఆయన మాట అస్సలు వినడంలేదు. "శాంతి" ఆటలో కూడా పిల్లలు కుక్క పిల్లుల అరుపులతో అల్లరి చేస్తున్నారు. "నేను ఏం చెయ్యాలి? ఈ పిల్లలను నావైపుకి ఎలాతిప్పుకోవాలి? సరే, వీళ్ళని కథలతో ఆకట్టుకోవాలి" అని మాష్టారు కథ చెప్పడం మొదలు పెట్టారు. మూడు గంటలు చిటికెలో గడిచిపోయాయి. పిల్లలు మొహం విప్పార్చుకుని, చెవులు రిక్కించి మరీ వింటున్నారు. బడి గంట కూడా కొట్టారు. అయినా పిల్లలకు ఇంటికి వెళదామన్న ధ్యాస కూడా రాలేదు. వాళ్ళకి కథలు వినడం చాలా హుషారుగా ఉంది. మరో పది రోజుల వరకు లక్ష్మీశంకర్ పిల్లలకి కథలతోనే కాలం గడిపేశారు. పిల్లలు మంత్రముగ్ధులై వింటూ మాష్టారి చుట్టూ గుండ్రంగా కూర్చునేవారు. ఎవరూ పిచ్చి అరుపులు అరవలేదు. గోల చేయలేదు. పదకొండవ రోజు కూడా పిల్లలు మాష్టారిని కథలు చెప్పమని అడిగారు. "నిజం చెప్పాలంటే నాదగ్గర ఉన్న కథల సంపదని అంతా మీరు ముందే దోచుకున్నారు. ఆలోచిస్తే మన తరగతిలో నలభైమంది పిల్లలు ఉన్నారు. అందరి దగ్గరా ఒకటే పుస్తకాలు ఉండడం ఎంత విచారకరం!!



అందుకని ఈసారి ఈ పుస్తకాలని ఎవరూ కొనవద్దు. పుస్తకాలకి అయ్యే డబ్బును అందరూ నాకు ఇచ్చెయ్యండి. ఆ డబ్బులతో ప్రతీ ఒక్కరికీ మూడు రకాల కథల పుస్తకాలు తీసుకువస్తాను. అప్పుడు అందరం ఎన్నో కథలని విని ఆనందించవచ్చు" అని శంకర్ మాష్టారు అన్నారు. ఈ విధంగా క్లాసులోనే చిన్న గ్రంథాలయం మొదలు పెట్టారు. బడి పుస్తకాలు మూడింటికి బదులు పిల్లలందరికీ వందకంటే ఎక్కువ కథలు చదివే అవకాశం దొరికింది. ✪

# సమ్మర్ హిల్

డెబ్భై సంవత్సరాల కిందట ఇంగ్లాండులో ఎ.ఎస్.నీల్ సమ్మర్ హిల్ అనే ఒక బడిని తెరిచారు. ప్రపంచంలో స్వేచ్ఛనిచ్చిన మొదటి బడి ఇదే. ఇక్కడ పిల్లలకి ఏ నియమాలూ, క్రమశిక్షణా ఉండవు. సమ్మర్ హిల్‌లో బడికి వేసుకునే బట్టలు, ప్రార్థన, బడిగంట, హాజరీ, పాఠ్యక్రమం, ఇంటిపని,



పరీక్షలు ఏమీ ఉండవు. పిల్లలకి ఇక్కడ ఎంతో స్వేచ్ఛ. వాళ్ళకి ఇష్టమైతే తరగతికి వెళ్ళవచ్చు లేదా గోల చేయవచ్చు. బొమ్మలు చేయవచ్చు లేదా సీతాకోక చిలుకలవెంట పరిగెత్తి పట్టుకోవచ్చు. వర్క్‌షాపులో పనులు నేర్చుకోవచ్చు. నిజంగా సమ్మర్ హిల్ ఆనందాల పాఠశాల.

ఇక్కడికి ఎక్కువగా పెంకి లేదా అల్లరి పిల్లలు వస్తుంటారు. ఒకరోజు ఎనిమిది సంవత్సరాల పిల్లవాడు ఈ బడికి వచ్చాడు. పిల్లవాడి అల్లరి భరించలేక వాడిని అంతకుముందు బడినుంచి పంపించేసారు. అందుకని ఈ పిల్లవాడికి ఏ బడికీ వెళ్ళాలనీ లేదు. వాళ్ళ నాన్న బలవంతంగా ఈ పిల్లవాడిని ఇక్కడ చేర్చడంతో వాడు చాలా కోపంగా ఉన్నాడు. ఆ కోపంలో, ఒక రాయి తీసుకుని కిటికీ అద్దాన్ని పగలకొట్టాడు. అక్కడికి దగ్గరలోనే నీల్ కూడా ఉన్నాడు. అయినా ఈ పిల్లవాడిని ఏమీ అనలేదు. ఈ పిల్లవాడు అలా కిటికీల అద్దాలను పగలకొడుతూనే ఉన్నాడు. పదకొండో అద్దం పగలకొట్టిన తర్వాత ఆ పిల్లవాడికి అలుపు వచ్చింది. నీల్ అప్పుడు ఒక రాయిని తీసుకుని పన్నెండవ కిటికీ అద్దాన్ని తానే పగలగొట్టాడు. ఆవిధంగా



ఉపదేశం ఇవ్వకుండానే నీల్ ఆ బాలుడి మనసు దోచుకున్నాడు. "మంచి గురువువి కావాలంటే, పిల్లలకి ఉపదేశాలు, నీతులు చెప్పవద్దు. ఎప్పుడూ పిల్లల పక్షమే ఉండండి. వాళ్ళకి కావాల్సిన ప్రేమని ఇవ్వండి" అని నీల్ అంటాడు. ✪

## సరికొత్త ప్రయోగం

సిల్వియా ఏష్టన్ వార్నర్ ఇరవై నాలుగు సంవత్సరాలు న్యూజిలాండ్‌లో "మావరీ" జాతి పిల్లలకి చదువు చెప్పింది. విద్యాబోధనలో ఆమె అనుభవాలను "టీచర్" అనే పుస్తకంగా ఆవిడ రాశారు. పిల్లల మొదటి మాటలు ఎంతో అమూల్యమైనవి. ఈ ఆత్మీయమైన "మొదటి మాటల్లో" పిల్లల బతుకు భారం లేదా వారి పల్లెల పరిమళాలు నిండి ఉంటాయి.

"ఈరోజు మీకు ఏ మాటలు కావాలి?" అని వస్తూనే సిల్వియా పిల్లలను అడుగుతుంది. పిల్లలు వెంటనే "దెయ్యం", "పాము" లేదా బల్లి వంటి వగైరా భయంకరమైన మాటలు చెబుతారు. పిల్లలు ఎప్పుడూ వీటిభయం నీడలో బతుకుతుంటారు. ఇవి వాళ్ళు స్వయంగా చెప్పిన మాటలు కాబట్టి సిల్వియా ఈ మాటలు రాస్తుండగా చూడడంవల్ల, పిల్లలు వాటిని ఎప్పటికీ మరచిపోలేరు. ఆ మరుసటి రోజు, సిల్వియా పిల్లలతో "దెయ్యం" కథలని చెప్పమంటుంది. పిల్లల్లో కల్పనాశక్తి రెక్కలుసాచి, వాళ్ళ మనసుల్లోంచి కథలు ఉరికి వస్తాయి. సిల్వియా ఈ కథలని, పిల్లల మాటల్లోనే రాసి పెడుతుంది. పిల్లల మాటల్లో, పిల్లలకోసం రాసిన కథలు కాబట్టి వాటిని పిల్లలు నిమిషాల్లో చదివేస్తుంటారు. ఈ కథలకి సరిపడా అందమైన బొమ్మలని వేస్తారు. ఈ విధంగా ఆరునెలల్లో పిల్లలు డెబ్భై సచిత్ర కథలు రాశారు. పిల్లల కలలు, అనుభవాలకి ఈకథలు ప్రతిరూపాలు.

ఈ సిల్వియా పద్ధతినే బ్రెజిల్ దేశంలో పౌలో ఫ్రేరీ అనే విద్యావేత్త





వయోజన విద్యకోసం ఉపయోగించి మంచి ఫలితాలు సాధించారు. ఈ పద్ధతివల్ల చదువురాని వాళ్ళు ఎంతో తొందరగా చదవడం, రాయడం నేర్చుకున్నారు. పిల్లల అంతరంగం విజ్ఞానంతో మండే "జ్వాలాముఖి" లాంటిదని, దాన్ని ప్రేమతో నింపడమే ఆలస్యం వారిలోని సృజనాత్మకత ఉబికి వస్తుందని సిల్వియా భావించేవారు. అందుకనే పిల్లల అనుభవాలను చదువులో ఒక భాగం చేసారు. ✪

## లక్ష్మి ఆశ్రమం

అల్మోరాకి కొద్ది దూరంలో కౌసానీ అనే ఒక చిన్న అందమైన పర్వత ప్రాంతం ఉంది. మంచుతో కప్పబడిన హిమాలయ పర్వత శ్రేణులు ఇక్కడి నుంచి కనపడతాయి. గాంధీజీ ప్రేరణతో డెబ్భై సంవత్సరాల కిందట, మీరా బెహన్ ఇక్కడ లక్ష్మీ ఆశ్రమాన్ని స్థాపించారు. మీరా బెహన్ జర్మనీలో పుట్టినా, ఆమె తల్లిదండ్రులు ఇంగ్లాండులో జీవించేవారు.



ఈ లక్ష్మీ ఆశ్రమంలో గఢ్వాల్ చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన వివిధ వయస్సుల బాలికలు ఉంటారు. ఇక్కడ చదువుకంటే జీవనోపాధికి కావాల్సిన మెలకువలు నేర్చుకోడానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. బాలికలు పొద్దున్నే అయిదు గంటలకు లేచి కట్టెలు తీసుకువచ్చి, నీళ్ళు నింపుతారు. కొంతమంది పశువుల ఆలనా పాలనా చూస్తారు. మరి కొంతమంది కూరగాయలు తరుగుతారు. కొంతమంది చెట్ల నుండి పళ్ళను కోస్తారు. గాంధీజీ బోధించిన శ్రమైక జీవనం ఇక్కడ ఇంకా సజీవంగా కన్పిస్తుంటుంది. ఆశ్రమం ఆర్థికంగా తన కాళ్ళమీద తాను నిలబడాలనే ప్రయత్నం ఇక్కడ జరుగుతోంది. తరువాత కొంత మంది పిల్లలు చరఖా తిప్పడంలోనో, బట్టలు నేయడంలోనో నిమగ్నమై ఉంటారు. మరి కొంతమంది బాలికలు పొయ్యి అంటించి మధ్యాహ్న భోజనానికి వంట వండుతారు. భోజనాల తర్వాత గిన్నెలు, వంటిల్లు కడిగి సర్దిన తర్వాత రెండు గంటలు మాత్రం చదువు చెబుతారు. అయిదు గంటల తర్వాత మళ్ళీ రాత్రి భోజనానికి కావాల్సిన ఏర్పాట్లు జరుగుతాయి.



చుట్టుపక్కల గ్రామాల్లో బాలికలు తమ ఇళ్ళల్లో చేసే అన్ని పనులకూ ఈ ఆశ్రమంలో బాలికలు చేస్తారు. వీటితోపాటు సమాజం, పర్యావరణం గురించి ఎన్నో విషయాలు నేర్చుకుంటారు. మెగసేసే అవార్డు గ్రహీత రాధా భట్ ఈ ఆశ్రమ నిర్వాహకురాలు. గఢ్వాల్ అడవుల పరిరక్షణ కోసం చేపట్టిన చిప్కో ఆందోళనలో చురుకుగా పాల్గొన్న విమలా బహుగుణ మరికొందరు మహిళా కార్యకర్తలు ఈ లక్ష్మీ ఆశ్రమాన్నించే వచ్చారు.

## అసాధారణ బడి

భీమతాల్‌లో టెలివిజన్‌లు తయారుచేసే ఒక కంపెనీ ఉంది. దాంట్లో ఒక గోదాములోనే నాన్‌తిన్ బాడి ఉంది – అదే చిన్నపిల్లల ఇల్లు, స్వర్గం. చుట్టు పక్కల నివసించే చిన్నపిల్లలే ఎక్కువగా ఈ ప్రాధమిక బడికి వస్తుంటారు. పది సంవత్సరాల క్రిందట రూథ్ రస్తోగీ ఈ బడిని మొదలుపెట్టారు.

పిల్లలకి ఈ బడికి రావడమంటే ఎంత ఉత్సాహమంటే, బడి మొదలు పెట్టడానికి చాలా ముందుగానే వచ్చేస్తారు. పాఠశాల బయట వాడేసిన టైర్లతో తయారుచేసిన ఒక అద్భుత ప్రపంచం వాళ్ళకోసం ఎదురు చూస్తుంటుంది. ఇందులో ఉయ్యాలలు, జారుడు బండలు, ఊగుడు బల్లలు, టైర్లతో చేసిన సొరంగం లాంటి ఎన్నో వింతలు ఉన్నాయి. గంటలకొద్దీ పిల్లలు ఇక్కడ ఆడుతూనే ఉంటారు.

ఈ బడిని చాలా చక్కగా రూపొందించారు. పిల్లలకి పనికి వచ్చే అన్ని వస్తువులనూ ఎంతో ఆలోచించి పెట్టారు. పిల్లలు తమకి కావాల్సిన వస్తువులని తామే తీసుకుని, వాడుకున్న తర్వాత మళ్ళీ తిరిగి ఇచ్చేస్తారు.



బడిలో పదవ తరగతిలో ఇద్దరు, ముగ్గురు అబ్బాయిలు ఉన్నారు. వాళ్ళు తమ చదువుకంటే ఎక్కువగా, పిల్లలకి ఎంతో సహాయం చేస్తుంటారు. ఒక మూలగా, పిల్లల ఎత్తులో, పిల్లలకి కావాల్సిన బొమ్మల పుస్తకాలు సర్ది ఉంటాయి. పిల్లలు తమకి ఇష్టమైన పుస్తకాన్ని తీసుకువచ్చి అక్కకి ఇస్తారు. అక్క ఈ పుస్తకాన్ని చదివి వినిపిస్తుంటుంది.

ఇలా రోజంతా పిల్లలు తమకి ఇష్టమైన పనుల్లో మునిగిపోయి ఉంటారు. కొంతమంది కాగితపు పక్షులు చేస్తుంటారు, మరి కొంత మంది మట్టికుండలు చేస్తుంటారు. కొంతమంది లూడో గానీ వైకుంఠపాళీ గానీ ఆడుతుంటారు. ఆటపాటలతోనో, దినచర్యలో భాగంగానో పిల్లలు భాషను, విజ్ఞానం పునాదులను అర్థం చేసుకుంటారు. సాధారణమైన పిల్లలకి తక్కువ ఖర్చుతో చదువు చెప్పే దీనిని ఒక అసాధారణమైన బడి అనాలేమో!!

✪

# గోర్కీ కాలనీ

రష్యా విప్లవంలో వేలమంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. వేల మంది పిల్లలు ఇళ్ళులేక రోడ్డున పడ్డారు. వారి ఆలనా పాలనా చూసే వాళ్ళు లేక, అమ్మా-నాన్నల తోడులేక ఈ పిల్లలు చెడుదారిని పట్టారు. చిన్నచిన్న



పిల్లలు కూడా జేబులు కత్తిరించడంలోనూ, కత్తితో బెదిరించి డబ్బులు దోచుకోడంలోనూ ఆరితేరారు. మరి కొంత చురుకైన వాళ్ళు లూటీలు, దొంగతనాలు చేయసాగారు. హింస పెరిగిపోవడంతో రష్యా ప్రభుత్వం ఆదేశంతో ఆంతోన్ మకరెంకో అనే విద్యావేత్త "గోర్కీ కాలనీ" అనే బడిని పిల్లలను మార్చడం కోసం మొదలుపెట్టారు. ఇందులో మొదట చేరిన పిల్లలు రకరకాల జైళ్ళ నుంచి వచ్చారు.

ఒక పధ్నాలుగేళ్ళ బాలుడు చాలాసార్లు జైలు జీవితాన్ని చవిచూసి మొండివాడయ్యాడు.



వీడిని చూసి జైలు అధికార్లు కూడా భయపడేవారు. ఈ బాలుడిని తీసుకు వెళ్ళడానికి మకరెంకో వెళ్ళగానే ఆ జైలు అధికార్లు "అమ్మయ్య! పీడ విరగడయ్యింది" అని ఊపిరి పీల్చుకున్నారు. మకరెంకో ఆ బాలుడి భుజాలు తట్టి, చేతిలో 200 రూబుళ్ళు, తీసుకురావాల్సిన సామానుల పట్టీ ఇచ్చి "గుర్రబ్బండీ తీసుకుని వెళ్ళి, ఈ కాయితంలో రాసిన సామాన్లు కొని, గోర్కి కాలనీకి తీసుకు వచ్చెయ్యి. మిగిలిన విషయాలు అక్కడే చెప్పుకుందాం" అన్నాడు.

ఆశ్చర్యపోయిన ఆ బాలుడు మకరెంకోని అపనమ్మకంగా చూడసాగాడు. అందరూ అతన్ని దొంగ, రౌడీ అని ఎన్నోతిట్లు తిడతారు. కానీ, ఈ మకరెంకో అతని మీద పూర్తి నమ్మకంతో గుర్రబ్బండీ, ఇంత డబ్బులు

అతనికే ఇచ్చాడు. గుర్రపు బండీ తీసుకుని ఆ బాలుడు వెంటనే వెళ్ళాడు. కానీ, మనసులో ఏదో భయం – "ఒకవేళ, ఎవరన్నా దొంగ, దారిలో ఆపి ఈ డబ్బులు దోచుకుంటే, మకరెంకోకి నేను మొహం ఎలా చూపించ గలను?" అందుకే, చిటికెలో సామాన్లు కొన్నాడు. కాలనీకి వచ్చేసరికి అతను భయంతో, చెమటతో తడిచి ముద్దయ్యాడు.

పరిస్థితుల ప్రభావంతో పిల్లలు దొంగలుగా మారవచ్చు. కానీ, సరియైన పరిసరాలతో పిల్లలు మారతారని, సోవియట్ యూనియన్ గర్వపడే మంచి నాగరీకులని చేయవచ్చునని మకరెంకో నమ్ముతాడు. గోర్కి కాలనీ అతని కలలను నిజం చేసింది. ✪

# అమూల్యమైన బడి



జూలియా వెబర్ గార్డెన్ అమెరికాలో ఒక మారుమూల పల్లెటూరి బడిలో చదువు చెప్పేవారు. డెబ్బై సంవత్సరాల కిందట ఆ బడి పరిస్థితి అధ్వాన్నంగా ఉండేది. బడిలో ఒకే ఒక గది ఉండేది. స్కూలు నడవడానికి కావాల్సిన నిధులు ఉండేవి కావు. ఆడుకోడానికి, చదువుకోడానికి కావాల్సిన వస్తువులు



ఎక్కువగా పిల్లలే స్వయంగా చేసుకునే వాళ్ళు, లేదా ఎక్కడినుంచైనా అప్పుగా తెచ్చేవారు. ఈ నిధులు కొరత, బడి పరిస్థితులని చూసి వెబర్ ఎన్నడూ కంగారు పడలేదు. ఒకటవ తరగతి నుంచి ఎనిమిదవ తరగతి





వరకు ఉన్న ఈ బడిలో వెబర్ ఏకైక ఉపాధ్యాయిని. చదువులోనే కాక మానసికంగా కూడా వెనుకబడిన పిల్లలు కొంతమంది ఉన్నారు. వెబర్ ప్రతి ఒక్కరినీ ప్రత్యేకంగా, శ్రద్ధగా చూసేది. అందుకనే పిల్లలందరూ శ్రద్ధగా చదివి ప్రగతి సాధించేవారు.

ప్రభుత్వం ఈ చిన్న పాఠశాలలకు అవ సరమైన శిక్షణ సామాగ్రి, అనుభవం గల ఉపాధ్యాయులు, కావాల్సిన ఆర్థిక సహాయం ఇచ్చే స్థితిలో లేదు. పెద్దపెద్ద కర్మాగారాల లాగా ఖరీదైన భవంతులతో అన్ని పాఠశాలలనూ నిర్మిస్తారు. కానీ ఈ చిన్న బడిలో చదివిన అనుభవం ప్రత్యేకమైనది. ఈ బడిలోని పేద విద్యార్థులు ఒకే ఒక నెలలో ఈ బడి వాతావరణాన్నే మార్చివేశారు. చుట్టు పక్కల చవకగా లభించే వస్తువులతోనూ, వాడి పారేసిన వస్తువుల తోనూ వైజ్ఞానికమైన పరిశోధనలు చేశారు. చాలా ఉపకరణాలను, దగ్గర్లోనే ఉన్న ఉన్నత పాఠశాల నుంచి అడిగి తెచ్చుకున్నారు. ఏదైనా



వస్తువు అవసరమైనప్పుడు ఏదైనా సంస్థ నుంచి కానీ వ్యక్తుల దగ్గర కానీ అప్పు తెచ్చుకునే వాళ్ళు. గ్రామంలోనే ఉన్న వడ్రంగి సహాయంతో ఒక చెక్క ఇల్లు, ఎన్నో ఆట వస్తువులను తయారు చేశారు. వెబర్ ఇచ్చిన ప్రేరణతో దగ్గర్లోనే ఉన్న జిల్లా గ్రంథాలయం నుంచి ఒక సంవత్సరంలో ఏడు వందల పుస్తకాలు తెచ్చుకుని చదివారు. అంటే ప్రతి విద్యార్థీ సుమారుగా 20కి పైగా పుస్తకాలని చదివారన్నమాట. చాలా పెద్ద–పెద్ద విలాసవంతమైన గ్రంథా లయాల్లో ఎన్నో పుస్తకాలు అల్మారాల్లో బందీ అయ్యి నిట్టూరుస్తుంటాయి. చదువు కోసం మనం ఎప్పుడూ నిధులు

చాలడంలేదని గొణుగు తూనే ఉంటాం. విద్యకి సరిపడా నిధులు లేవన్న ఏడుపు మనం ఎప్పుడూ ఏడుస్తూనే ఉంటాం. కానీ, నిజానికి కొరత నిధులలో కాదు, మన దృక్ప థంలో ఉంది. అర్థంలేని వ్యవస్థ కోసమో, పనికిరాని పాఠ్య పుస్తకాల కోసమో డబ్బులని ధారపోస్తాం. బడి సమాజంలో ఒక భాగం



అయినపుడు మాత్రమే పిల్లలు శ్రద్ధగా నేర్చు కుంటారు. అప్పుడే వాళ్ళ చదువు బయటి సమాజాన్ని తాకి ప్రభావితం చేస్తుంటుంది.

ఒక మంచి టీచర్ అవ్వాలంటే ఎన్నో కళల్లో ప్రవేశం ఉండాలి. వెబర్ విశిష్టత ఏమిటంటే ఆమెకి ఎన్నో నైపుణ్యాలు ఉన్నాయి.

ఆమె హార్మోనియం వాయిస్తుండేది, జానపద నృత్యం చేస్తుండేది, పాటలు పాడేది, గాలిపటాలను చేస్తుండేది, కళ్ళతో ఆటలు ఆడేది, కాగి తంతో విమానాలు చేసేది, చిత్ర లేఖనం చేసేది, కథలు వినిపిస్తుండేది. ఇంకా విచిత్రమేమిటంటే, ఆమె దాదాపు అన్ని చెట్లు, పక్షులు, రాళ్ళను గుర్తు పట్టగలిగేది. వీటన్నటితో పాటు ఆమెకి రాని విద్యలను పిల్లలే స్వయంగా నేర్చు కునేటట్లుగా ప్రోత్సహించేది. పిల్లలతో కలిసిపోయి, వాళ్ళతోపాటు వస్తువులను తయారుచేసేది, తప్పులుచేసి వాటిని పిల్లల దగ్గరే నేర్చుకునేది.



చాలా మంది టీచర్లకి శబ్దాల ప్రయోగం మాత్రమే తెలుసు. వాళ్ళు కేవలం చదివించ గలరు. దీనికి మించి వారి దగ్గర ఏ కళలూ ఉండవు. బడిలో నాలుగు గోడల మధ్య విసిగి పోకుండా పిల్లలని దగ్గర్లోనే ఉన్న అడవిలోకి పికినిక్‌కి తీసుకెళ్ళేది. చెరువు గట్టుమీద ఆడు



కోడమంటే పిల్లలకి ఎంతో మజా. చాలాసార్లు వారి చదువు బడి బయటే జరుగుతుంటుంది. వాళ్ళ బడిలో బోధనా సామాగ్రి లేదు, అయినా పిల్లలు వాళ్ళ ప్రశ్నలకి జవాబులు ఏదోవిధంగా వెతికి మరీ పట్టుకుంటారు. వెబర్ చెప్పే చదువు ఎవరో రూపొందించిన పాఠ్యక్రమాలకి లోబడి ఉండదు. ఆమె పిల్లల అభిరుచులకి, జిజ్ఞాసకి సరిపోయే పాఠ్య క్రమాన్ని తయారు చేస్తుంది. ఈ విధంగా ఆమె ప్రతీ సంవత్సరం అవే పాఠాలను చెప్పే విసుగు, బంధ నాల నుంచీ తప్పించుకోగలి గింది. – జులియా వెబర్ గార్డెన్, మైకౌంటీ స్కూల్ డైరీ ఆధారంగా.

✪

# మిస్టర్ డాక్టర్

జానుజె కోచార్క్ పోలాండ్ దేశంలో ఒక బీద యూదు పరివారంలో పుట్టాడు. ఆ ఇంట్లో తినడానికి తిండి దొరకడం కూడా కష్టంగా ఉండేది. కఠోర పరిశ్రమ, దీక్షతో చదివి కోచార్క్ డాక్టరు అయ్యారు. అయినా తన చిన్నప్పటి బీదతనాన్ని, పేదరికాన్ని కోచార్క్ ఎన్నటికీ మరవలేదు. అందుకనే పేద పిల్లల కోసం ఒక అనాధ ఆశ్రమాన్ని తెరిచారు. సుమారుగా వందమంది అనాధ పిల్లలు ఇక్కడ ఉండేవారు. పిల్లల రోగాలని నయంచేసే నిపుణుడిగా డాక్టర్ కొచార్క్‌కి ఎంతో పేరు ఉంది. అందుకనే, పిల్లలందరూ కోచార్క్‌ని ఎంతో ప్రేమగా మిస్టర్ డాక్టర్ అని పిలిచేవారు. మిస్టర్ డాక్టర్ కూడా పిల్లలను ఎంతో ప్రేమించేవారు. పిల్లలకి తండ్రి, గురువు, స్నేహి తుడు – అన్నీ తానై ఉండేవాడు. "ఒక సీతాకోక చిలుక ఆత్మకథ", "నేను ఎప్పుడు చిన్న పిల్లవాడిని అవుతాను?" లాంటి ఎన్నో పుస్తకాలను కోచార్క్ రాశారు.

రెండవ ప్రపంచయుద్ధకాలంలో హిట్లర్ లక్షలమంది యూదులని గ్యాస్ బట్టీలలోకి పంపించాడు. ఒకరోజు హిట్లర్ కిరాతకమైన పోలీసులు




అనాధాలయానికి వచ్చి బెదిరించారు. పిల్లలందర్నీ ఒక వరుసలో గ్యాస్ బట్టీలలోకి వెళ్ళమని ఆదేశించారు. కోచార్క్‌ని అడ్డు తప్పుకోమని పోలీసులు అన్నారు. అయినా, మిస్టర్ డాక్టర్ పిల్లలకి తోడుగా వరుసలో ముందు నిలుచున్నారు. పిల్లలు మిస్టర్ డాక్టర్‌తో పాటు పాటలు పాడుతూనే ముందుకి వెళ్ళారు. పిల్లల మనసులో చనిపోతామన్న భయం లేనే లేదు. వాళ్ళకి ప్రియమైన డాక్టరు తోడు ఉన్నాడన్న తృప్తి ఉంది. గ్యాస్ భట్టీ రాగానే కోచార్క్ అందరికన్నా ముందు వెళ్ళారు. పిల్లలు ఆయన వెనుకనే వెళ్ళారు. కోచార్క్ లాంటి గొప్ప గురువు అంతిమ క్షణంలో కూడా తన పిల్లలను వదలలేదు. ఆఖరి శ్వాసవరకు పిల్లల కన్నీళ్ళను తుడుస్తూ డాక్టర్ వాళ్ళకి తోడుగా ఉన్నాడు. "ప్రపంచంలో అనాదిగా అన్నిటినీ కోల్పోయిన వాళ్ళు పిల్లలే" అన్న కోచార్క్ మాటలు ఇప్పటికీ మన చెవుల్లో వినిపిస్తూనే ఉంటుంది. ✪



# పనికిరానివస్తువుతో ఉపయోగాలు

మనం వస్తువులను వాడిన తర్వాత పారేస్తుంటాం. వినియోగ సంస్కృతి అంతా "ఎక్కువగా కొను, ఎక్కువగా పారేయి" అనే సిద్ధాంతం మీద ఆధారపడి ఉంది. ఈ పారేసే సంస్కృతి వల్ల ఒకవైపు చెత్తకుప్పలు పెరుగుతుండగా మరో వైపు భూమిమీద సహజవనరుల దురుపయోగం పెరిగి కొరత ఏర్పడుతోంది. వస్తువులని చూడడంలో మరొక దృష్టికోణం కూడా ఉండవచ్చు. ఈ దృష్టితో చూస్తే, ప్రతీ ఒక్క వస్తువుకీ ఎన్నో స్వరూపాలు ఉంటాయి. ఒక రూపం జీవనం పూర్తికాగానే, అదే వస్తువు కొత్త రూపంలో ఉపయోగపడడానికి సిద్ధం!

పర్యావరణం పట్ల లోతైన స్పందన ఈ కథకి కొసమెరుపు. ఒకసారి బుద్ధ భగవానుడిని ఒక భిక్షువు కొత్త బట్టలు ఇమ్మని అడిగినపుడు "నీ పాత బట్టలను ఏంచేశావు?" అని అడిగాడు.

"భగవాన్! ఆ బట్టలు బాగా పాతబడితే, పరుపుమీద వేసుకునే దుప్పటిగా వాడుతున్నాను" అని జవాబిచ్చాడు భిక్షువు.

"ఆ పాత దుప్పటిని ఏం చేశావు?" అని బుద్ధుడు ప్రశ్నించాడు.

"ఆ దుప్పటి బాగా పాతబడి చిరిగిపోతే, దిండు గలీబుగా వాడు తున్నాను" అన్నాడు భిక్షువు.

"మరి అయితే, ఆ పాత దిండు గలీబుని ఏం చేశావు?" అని ప్రశ్నించాడు బుద్ధుడు.

"ఆ పాత దిండు గలీబు ఎంతగా అరిగి, చిరిగి పోయిందంటే, దాన్ని కాళ్ళు తుడుచుకునే పట్టాగా మాత్రమే వాడగలమని అనుకున్నాను" అన్నాడు భిక్షువు.



విషయం యొక్క లోతుపాతులు తెలుసుకునేందుకు విచారణ జరుపుతూ, చివరిసారిగా బుద్ధుడు "అయితే ఆ పాత పట్టాను నువ్వేం చేశావో" చెప్పమన్నాడు.

"భగవాన్! పాత పట్టా పీలికలు పీలికలుగా చిరిగిపోయింది. అందుకనే, ఆ దారపు పోగులను చుట్టి వత్తిలాగా నూనెలో ముంచి దీపం వెలిగిస్తున్నాను" అన్నాడు ఎంతో నమ్రతగా భిక్షువు.

బుద్ధుడు ఆనందించి, వెంటనే భిక్షువుకి కొత్త బట్టలని ఇప్పించాడు. మీరూ ఆలోచించండి! ✪



# దీన్నే బడి అనాలేమో

"దీన్ని బడి అని తప్పని సరిగా అనాలి. పిల్లలయితే స్కూలుకి మాత్రమే వెళతారు. ఒకవేళ, దీనిని "స్కూలు" అనకపోతే, పిల్లలు ఇక్కడికి రావడమే మానేస్తారు" అని ఒక ఉపాధ్యాయుడు అన్నాడు. ఈ బడి పేరు "లిటిల్ న్యూ స్కూల్" ఇది డెన్మార్క్‌లోని కోపెన్‌హాగెన్‌లో ఒక బస్తీలో ఉంది. ఇక్కడ పిల్లలు రోజూ ఒకర్ని ఒకరు కలుసుకుంటారు, రోజంతా మాట్లాడుకుంటూ ఉంటారు, రకరకాల వస్తువులు తయారుచేస్తారు, ఆడుకుంటారు. ఇది మిగిలిన పాఠశాలలకన్నా భిన్నమైనది. ఇక్కడ విద్య పేరుతో ఏ చదువూ



చెప్పరు. స్కూల్లో ఆరు నుంచి పధ్నాలుగేళ్ళ వయసుగల పిల్లలు మొత్తం 85 మంది ఉన్నారు. ఈ బడి పిల్లలకి ఎంతో ప్రియమైనది. ఎందుకంటే ఇక్కడ పిల్లలు తమకి ఇష్టమైన విధంగా జీవించవచ్చు. అందుకనే, బడికి రావడమంటే వారికెంతో ఉత్సాహం. స్కూల్లో ఎవరూ హాజరీ తీసుకోరు. ఎవరైనా పిల్లలు బడికి రావడం లేదంటే, వాళ్ళు తప్పకుండా బడి కంటే ఉత్కంఠ భరితమైన పనిలో మునిగి ఉండవచ్చునని మిగిలిన పిల్లలు అనుకుంటారు. అందుకనే ఆ పిల్లలు తిరిగి రాగానే, అందరూ వాళ్ళ చుట్టూ మూగి, గుంపుగా కూర్చుని వారి అద్భుత అనుభవాలను చెప్పించుకుంటారు.



ఈ స్కూల్లో ఒక పెద్ద హాలు, రెండు గదులు ఉన్నాయి. మిగిలిన బడులతో



పోలిస్తే ఇది ఒక బీద పాఠశాల అనే చెప్పాలి. వైజ్ఞానిక పరిశోధనలు చేయ డానికి తగిన ప్రయోగశాలలు, లెక్కల కోసం ఖరీదైన ఉపకరణాలూ లేవు. కొన్ని మంచి పుస్తకాలు, పజిల్స్, కొన్ని బొమ్మలు మాత్రం ఉన్నాయి. ఒక పియానో, ఒక గిటారు కూడా ఉన్నాయి. పెద్ద చెరువులో చేపలు కూడా ఉన్నాయి. ఒక బల్లమీద కొన్ని వడ్రంగి పరికరాలు ఉన్నాయి. వీటితో పిల్లలు రకరకాల వస్తువులు చేస్తుంటారు. ఇక్కడ చదువులేదు. పాఠ్యక్రమమూ లేదు. ఎవరైనా పిల్లలు రోజంతా కేవలం అందమైన చేప పిల్లలని చూస్తూ గడిపినా, బడిలో ఎవరూ ఏమీ అనరు. దీని వెనుక "పిల్లలెప్పుడు ఖాళీగా కూర్చోరన్న" నమ్మకం ఉంది. వాళ్ళు ఎప్పుడూ ఏదో ఒకటి చేస్తూనే ఉంటారు. ఇలా చేసిన తర్వాతే వాళ్ళు ప్రపంచాన్ని అర్థం చేసుకుంటారు, నేర్చుకుంటారు. ఈ స్కూల్లో పనిచేసే టీచర్లు ఎంతో తెలివైన వాళ్ళు. వాళ్ళకి ఎన్నో విద్యలు తెలుసు. బయటి ప్రపంచంతో వాళ్ళకి మంచి అనుభవం కూడా ఉంది. నిజం చెప్పాలంటే, వాళ్ళలో ఎవరూ నిజమైన టీచర్లు లేరు. ఒకరు సైకిల్ షాపులో పనిచేసేవారయితే, మరొకరు నర్సుగా పనిచేసేవాళ్ళు. వాళ్ళలో ఎన్నో నైపుణ్యాలు ఉన్నాయని పిల్లలు వాళ్ళని ఎంతో గౌరవిస్తారు.



బడిలో సుమారు 2000కి పైగా చెక్కపెట్టెలు ఉన్నాయి. దగ్గర్లోనే ఉన్న ఒక పరిశ్రమ వీటిని పడేసింది. ఇలా పడేసిన బల్ల చెక్కలను పిల్లలందరూ కలిసి బడికి తీసుకువచ్చారు. ఈ దీర్ఘ చతురస్రాకారపు చెక్కపెట్టెలతో



రోజంతా పిల్లలు ఆడుతూనే ఉంటారు. వీటినే ఏరి ఏరి ఇటుకలు లాగా ఉపయోగించి గోడలు తయారు చేస్తారు. వీటినే మళ్ళీ పోగేసి కుర్చీ-బల్ల, అల్మరా, అరలు తయారు చేస్తారు. పొద్దున్నే పిల్లలందరూ కలిసి, వాళ్ళ తరగతి గది నమూనాలను, వాటి కొలతలను తీస్తారు. అప్పుడు, స్కూల్లోని సామానంతా తోసుకుంటూ బయటికి తీసుకువస్తారు. తరువాత కొత్త కొలతలతో గోడలు తయారు చేస్తారు. ఈ పెట్టెలని ఉపయోగించి హాలుని రకరకాల గదులుగా తయారుచేస్తారు. ఒక గది నాట్యంకోసమైతే, మరొకటి సంగీతం కోసం. పనిలో పిల్లలందరూ చేయి వేస్తారు.



రోజులో ఒకసారి ఎవరో ఒక పిల్లవాడు ఢోలక్ వాయిస్తూ, దప్పు కొడుతుండగా, మిగిలిన పిల్లలు నాట్యం చేస్తుంటారు. సంగీతం మత్తులో పిల్లలు గంటల తరబడి నాట్యం చేస్తూనే ఉంటారు. ఒక మూలగా ఒక బాలుడు, తన కంటే చిన్నవాళ్ళకు కథలు వినిపిస్తూ ఉంటాడు. కొంతమంది పిల్లలు గ్యాస్ వెల్డింగ్ చేస్తుంటారు. మరొక పిల్లాడు ఇనుప మేకులను గ్యాస్‌పొయ్యి మీద ఎర్రగా కాల్చిన తర్వాత కర్రలలో గుచ్చు తుంటాడు.



ఇక్కడ పిల్లలు బట్టీ పట్టకుండానే ఎన్నో విషయాలు నేర్చుకుంటారు. పక్షంలో ఒకటి రెండు రోజులు స్కూలుకి తాళంపెట్టి అందరూ దగ్గర్లోనే ఉన్న బేకరీ, బస్‌స్టాండ్, పోస్టాఫీసు, రైల్వేస్టేషన్ మొదలైనవన్నీ తిరిగి వస్తారు. రోజంతా మాట్లాడుతూ ఉండడం వల్ల, పిల్లలకి భాషమీద గట్టి పట్టు ఏర్పడు



తుంది. ఏదైనా సంఘటన వివరించినప్పుడు వాళ్ళు కళ్ళకు కట్టినట్లుగా చెబుతారు. దీనివల్ల వాళ్ళల్లో ఆత్మ విశ్వాసం కూడా పెరుగుతుంటుంది. ఈ బడి నుండి వెళ్ళిన వాళ్ళు ఏ స్కూల్లో అయినా మంచి మార్కులు సంపాదించి పేరు తెచ్చుకుంటారు.

స్కూల్లో శిక్షణా సామాగ్రి, ఉపకరణాలు చాలా తక్కువ ఉన్నాయి. దీనికి ముఖ్య కారణం నిధుల కొరతే. ఒకవేళ తగినంతగా నిధులు ఉన్నా, అప్పుడు కూడా వాళ్ళు అవసరం లేని / అర్థంలేని సామాన్ల మీద ఖర్చు పెట్టరు. పిల్లలకి అడవుల్లో విహారం లేదా పిక్‌నిక్ చేసుకోవడంలో ఎంతో ఆనందం ఉంది. ఒకసారి ఈ బడిలోని పిల్లలు దగ్గర్లోనే ఉన్న స్వీడన్ దేశానికి పాదయాత్ర చేశారు. డబ్బులే ఉంటే, ఒక పాత బస్సు కొనాలనీ, దానిలో పిల్లలందరూ సుదూర పర్వతాలు, సముద్ర తీరాలలో విహరించాలనీ పిల్లల కోరిక. ఇదండీ న్యూ లిటిల్ స్కూలు కథ – పేదదే అయినా అనూహ్యమైన బడి. మీకూ అక్కడే చదవాలని ఉందా? ✪

# ఉదయాచల్ పాఠశాల

ముంబాయిలోని ఉదయాచల్ పాఠశాల మన దేశంలోని మంచి పాఠశాలల్లో ఒకటిగా పేరు పొందింది. దీనిని గోద్రెజ్ కంపెనీ నడుపుతోంది. ఈ స్కూలుని శ్రీమతి వకీల్ స్థాపించారు. ఆమె చాలా సంవత్సరాలు గురుదేవ్ రవీంద్రనాథ్ ఠాగూర్ శాంతి నికేతన్ ఆశ్రమంలో పనిచేశారు.

ఈ స్కూల్లో ఒక బాల్‌వాడీ అంటే ప్రీ– స్కూలు కూడా ఉంది. ఇక్కడికి మూడు సంవత్సరాల వయసుగల పిల్లలు వస్తారు. రోజంతా రకరకాల





కార్యక్రమాల్లో మునిగి ఆనందిస్తుంటారు. పిల్లలు ఇంటినుంచి దినపత్రికలని తీసుకువచ్చి ఒక డ్రమ్ములో తడుపుతారు. ఇలా నానడంవల్ల కాయితపు ముద్దలు తయారవుతాయి. పొద్దున్నే పిల్లలు మంచి హుషారుగా ఉన్నపుడు కట్టె పుల్లలతో ఈ కాయితపు గుజ్జును నేలమీద కొట్టి కొట్టి మెత్తగా తయారు చేస్తారు. ఈ పని చేయడంలో వాళ్ళకెంతో మజా! ఈ గుజ్జులో జిగురు, మట్టి కలిపి, దానితో పిల్లలు ఎన్నో జంతువుల బొమ్మలు తయారుచేస్తారు. ఎండిన తర్వాత బొమ్మలకి రంగులు కూడా వేస్తారు. ఈ కాయితపు ముద్దతో తయారుచేసిన బొమ్మలు తొందరగా విరగవు.

ఈ బడిలో సుమారుగా మూడువందల చెత్తడబ్బాలు ఉన్నాయి. వాటిని పిల్లలే ఎంతో చవకగా స్కూల్లోనే తయారుచేశారు. పాత సైకిల్ ట్యూబులతో చెట్లు, యంత్రం, ఇల్లు లాంటి ఆకారాలు కత్తిరించి దానిని చదునైన చెక్క మీద లేదా పాలరాయి ముక్కలమీద అంటిస్తారు. నలుగురైదుగురు కలిసి గుండ్రంగా కూర్చుంటారు. వాళ్ళ మధ్యలో ఒక గిన్నెలో రంగుతో తడిసిన మొద్దుబట్ట ఉంచుతారు. పిల్లలు పాత వార్తాపత్రికల మీద ముద్రలతో ఎన్నో అందమైన ఆకర్షణీయమైన చిత్రాలు వేస్తారు.

పాఠశాలలో సంగీతం అంటే కూడా ఎంతో మక్కువ. పిల్లలు నాలు గైదు రకాల వాద్య పరికరాలు తయారుచేశారు. ఎలా అంటారా? – డబ్బాలో రాళ్ళు నింపితే అది ఒక వాయిద్య మౌతుంది. రెండు మూతలతో మంజీరా, ఒక డబ్బా మీద తీగకట్టి ఏక్‌తారా అవుతాయి!! కొంతమంది పిల్లలు వాటిని వాయిస్తుంటే, మిగిలిన పిల్లలు నాట్యం చేస్తారు. ఈ బాల్‌వాడీలో క, ఖ, గ రాయడంగానీ, అంకెలు వల్లెవేయడంగానీ నేర్పించరు. ఇక్కడ పిల్లలు సంతోషాలతో తమ బాల్యాన్ని గడుపుతారు. ✪

# రైలుబడి

ఈ జపనీస్ బడిపేరు యాతోమాయే! స్థాపించింది 1937లో! కానీ కేవలం ఎనిమిది సంవత్సరాలు మాత్రమే నడిచింది. ఈ స్కూలు ముఖ్య ఉపాధ్యాయుడు 'కొబయాషీ' ఒక అద్భుతమైన వ్యక్తి. స్కూలు అంటే అందరికీ పెద్ద భవనాలు, ఆట స్థలాలు, బల్లలు, కుర్చీలు గుర్తుకు వస్తాయి. కానీ ఈ జపనీస్ బడిలో మాత్రం పాత రైలుడబ్బాలే తరగతి గదులు. అందులో ఒక రైలు డబ్బా పుస్తకాలయం కూడా ఉంది.

ఈ స్కూలులో చదివిన అద్భుతమైన అనుభవాన్ని కురయోనాగి అన్న ఆమె 'తోత్తోచాన్' అనే పుస్తకంలో రాశారు. కురియోనాగి ముద్దుపేరే 'తోత్తోచాన్'. 1980లో ఈ పుస్తకం ముద్రించినపుడు విద్యా రంగంలో ఒక అలజడి సృష్టించింది. ముద్రించిన పదహారు నెలల్లోనే ఈ పుస్తకం 50 లక్షల కాపీలు అమ్ముడు పోయాయి. ఈ పుస్తకాన్ని తెలుగులో 'రైలుబడి'గా హైదరాబాద్ బుక్‌ట్రస్ట్ ప్రచురించింది.

తోత్తోచాన్ ఎంతో తెలివైన, జిజ్ఞాస, సృజనాత్మకశక్తి ఉన్న పిల్లో అంతటి అల్లరి పిల్ల. తనకి ఏ పని అంటే ఇష్టమో చిటికెలో దానిలో మునిగిపోతుంది.



ఈ చంచల స్వభావం, మొండితనం వల్ల తోత్తోచాన్‌ని ఒక సాధారణ స్కూలు నుంచి తీసివేశారు. అప్పుడు, ఈ రైలు బడిని తోత్తోచాన్ స్వయంగా ఎన్నుకుంది. ఆ ముందు స్కూల్లో తోత్తోచాన్ ఎన్నోకష్టాలు పడింది పాపం!! "ఏ స్కూలుకి అయినా ప్రత్యేకమైన పాట ఉండకపోతే – ప్రార్థనా సమయంలో అదేపాట రోజూ పాడాల్సిన బాధ తప్పుతుంది" అనుకునేది తోత్తోచాన్.

ఈ రైలుబడిలో పిల్లల్ని ఎవరూ "ఏయ్! ఈ పని చేయవద్దు", "అల్లరి చేయొద్దు" అని అరిచి ఆపరు. ఎవరికి ఇష్ట మైన పని వారు చేయవచ్చు. తోత్తోచాన్‌కి అన్నిటికంటే విచిత్రం – ఈ బడిలో చదవ దానికి వచ్చినపుడు, కోబయాషీ నాలుగు గంటలపాటు తోత్తో చాన్ చెప్పినదంతా శ్రద్ధగా విని "ఇంకా ఏమన్నా ఉందా చెప్పేందుకు?" అని అడ గడం. ఇక్కడ చదువు గంటలు, పీరియడ్ లకి లోబడి ఉండదు. తమకి ఇష్టమైన, వీలైన విధంలో పిల్లలు తమ పని చేసు కుంటారు.



ఇక్కడ గురువు తనకి తెలిసినదంతా ఉపన్యాసంలాగా చెప్పేకంటే, పిల్లలు స్వయంగా తెలుసుకునేలాగా, అనుభవం పొందేందుకు ప్రోత్సాహ మిస్తారు. పిల్లలని విహారానికని పొలాలకి తీసుకు వెళ్తారు. వాళ్ళ తప్పుల చిట్టాలు తల్లిదండ్రుల దగ్గరికి వెళ్ళనే వెళ్ళవు. పిల్లలు కోబయాషీ నెత్తిన ఎక్కి ఆటలు ఆడతారు. ఒడిలో, భుజాల మీద గంతులేస్తారు. అవసరం వచ్చి నప్పుడు ఆయన దగ్గర డబ్బులు అప్పుగా కూడా అడిగి తీసుకుంటారు. వాళ్ళ ఓటమిని ఆయన ఎన్నడూ గేలిచేయలేదు. ఎప్పుడూ తిట్టలేదు. అందుకే పిల్లలు సంతోషంగా రైలుబడికి వెళ్తారు.

ఈ 'రైలుబడి' కథ మీరూ తప్పకుండా చదవండి. ✪

# అసలైన శిక్షణ

పట్టణ ప్రాంత ప్రజలతో గాంధీజీ "చీపురు, బక్కెటు మీ చేతుల్లోకి తీసుకునేంతవరకు మీ పట్టణాలు శుభ్రంగా ఉండవు" అనే వారు. ఒకసారి గాంధీజీ మండల బడిలో శిక్షకులతో మాట్లాడుతూ "మీ పిల్లల చదువుతో పాటు భోజనం వండడం, మూత్రశాలలు శుభ్రం చేయడం లాంటివి నేర్పించినపుడే మీ బడి ఆదర్శంగా నిలుస్తుంది" అన్నారు.

గాంధీజీ ఆశ్రమంలో అన్ని కులాల వాళ్ళు, మతాల వాళ్ళు ఆశ్రమం శుభ్రం చేయడానికి తలా ఒక చెయ్యి వేస్తారు. చెత్త అంతా ఒక గొయ్యిలో వేసి నింపుతారు. పారేసే అన్ని వస్తువులకీ మరొక మంచి ఉపయోగం ఉంటుంది. కూరగాయల తొక్కులు, మిగిలిపోయిన భోజనం, మూత్ర శాలల్లోని మలమూత్రాలు ఇలాంటి వాటితో పొలాలకి మంచి ఎరువు తయారవుతుంది. మురికి నీరుకూడా పొలాల్లో నీరు పెట్టడానికి పనికి వస్తుంది.

గాంధీజీ శిక్షణా పద్ధతిని మౌలిక విద్య అన్న పేరుతో పిలుస్తుంటారు.

మనం రోజూ ఉపయోగించే వస్తువులను తయారు చేసుకోవడం, చేతిపనులు ఈ శిక్షణా పద్ధతిలో ముఖ్యమైనవి. ఇక్కడ స్కూల్లో పిల్లలు రాట్నం వడకడం, మగ్గాలమీద నేయడం, చర్మంతో చెప్పులు చేయడం లాంటి ఎన్నో కళలు నేర్చుకుంటారు. సాధారణ ప్రజలు ఎప్పుడైతే తమ అవసరాలకి ఉపయోగించే వస్తువులను స్వయంగా చేసుకుంటారో అప్పుడే ఆత్మవిశ్వాసంతో జీవించగలరని గాంధీజీ గట్టిగా నమ్మేవారు.





ప్రస్తుతానికి వస్తే, సాధారణ మానవుడు తన జీవితం మీదే నియంత్రణని పోగొట్టుకున్నాడు. మనం ఇప్పుడు బట్టలు కత్తిరించడం, బట్టలు కుట్టడం, బట్టలు నేయడం, వంట వండడం, మొక్కలు నాటడం, శుభ్రంగా ఉంచుకోవడం లాంటి ప్రాథమిక నైపుణ్యాలను, గొప్ప కళలను మరచిపోతున్నాం. అందుకనే, ఈ కళలన్నింటినీ మన పిల్లల చదువులో ఒక అంశంగా చేయాలి.

✪

# ఎలుకల కథ - పిల్లలకి వ్యథ

రాబర్ట్ రోజన్‌థాల్ అమెరికాలో మనోవైజ్ఞానిక ప్రొఫెసర్. పరిశోధన చేసే ఇద్దరు విద్యార్థులకి చెరొక ఎలుకని ఇచ్చి వాటికి చిక్కు మార్గాల్లోంచి బయటికి రావడం నేర్పించమన్నాడు. మొదటి విద్యార్థితో రహస్యంగా "ఇది చాలా తెలివైన ఎలుక. తప్పకుండా గెలుస్తుంది" అన్నాడు. రెండవ విద్యార్థి చెవిలో గుసగుసగా "ఇది కొంచెం తెలివితక్కువ ఎలుక. అయినా సరే, ప్రయత్నించు" అన్నాడు. ఈ ఎలుకల్లో తేడాలు కేవలం విద్యార్థుల మనసుల్లోనే కానీ ఎలుకలు ఒక లాంటివే. పరీక్ష పెట్టిన రోజున 'తెలివైన' ఎలుక చిటుక్కున నిముషంలో ఆ కష్టమైన మార్గంలోంచి బయటికి వచ్చేసింది. కానీ, "మందబుద్ధి"గల ఎలుక తన స్థానంలోంచి కదలడానికి కూడా ప్రయత్నించలేదు.



ఆశ్చర్యపరిచే ఈ ఫలితాల తర్వాత, రోజన్‌థాల్ ఈ ప్రయోగాన్ని ఒక స్కూలులో ప్రయత్నించారు. దీనికోసం మే 1964లో ఆయన తన బృందంతో శాన్‌ఫ్రాన్సిస్కో పట్టణంలోని ఒక పేద ప్రాథమిక పాఠశాలకి వెళ్ళారు. ఇక్కడికి పేద శ్రామికుల, అల్పసంఖ్యాక వర్గాల పిల్లలు వస్తుంటారు. రోజన్‌థాల్ తన బృందం హోవార్డ్ విశ్వవిద్యాలయం నుంచి వచ్చామని, ఈ పరిశోధన ప్రభుత్వ వైజ్ఞానిక సంస్థ కోసం చేస్తున్నామని చెప్పారు. అంత పెద్ద పేరు విని, ఆ బీద ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు సంతోషంతో స్వాగత సత్కారాలు పలికారు.

రోజన్‌థాల్ పిల్లలందరికీ వాళ్ళ తెలివిని తెలియచేసే ఒక ప్రామాణిక ఐ.క్యూ. పరీక్ష పెట్టారు. దాని ఫలితాలేమిటో ఆ ఉపాధ్యాయులకి చెప్పలేదు. తర్వాత, హాజరు పుస్తకం తీసుకుని, ఏ ఆధారం లేకుండానే, ప్రతీ మూడో



విద్యార్థిని "మందబుద్ధి లేదా తెలివి తక్కువవాడనీ" ప్రతీ నాలుగో విద్యార్థినీ "తెలివి"గల వాడనీ నిర్ధారించారు. అప్పటినుంచి ప్రతి పధ్నాలుగు రోజులకి ఒకసారి ఆయన ఈ బడిలో పిల్లలకి ఒక ప్రామాణిక ఐ.క్యూ. పరీక్ష పెట్టుండేవారు. ఈ పరీక్షల పరంపర రెండు సంవత్సరాలు నడిచింది.

ఈ పరీక్షల ఫలితాలు ప్రపంచాన్ని అంతటినీ కుదిపేసింది. తెలివిగల పిల్లలయినా, ఒకసారి రోజన్‌థాల్ 'మందబుద్ధి' కలవాడని చెప్పిన తర్వాత ఐ.క్యూ./మెల్లగా తగ్గిపోయింది. తెలివితక్కువ పిల్లలయినా రోజన్‌థాల్ భాషలో "తెలివి" కలవాడని ముద్రపడిన తర్వాత వాళ్ళలో ఐ.క్యూ. ముందు కన్నా ఎక్కువగా పెరిగింది. ఎందుకంటే, ఉపాధ్యాయులు వీళ్ళని ఎక్కువగా ప్రశ్నలు అడిగి ప్రోత్సహించారు.

ఈ పరీక్షలు ఒక మంచి గుణపాఠాన్ని నేర్పాయి. పిల్లలు తప్పకుండా విజయం సాధిస్తారని గురువుకి నమ్మకమే ఉంటే, వాళ్ళు తప్పకుండా గెలుపు సాధించి తీరతారు. అందుకనే పిల్లల విజయం మీద పూర్తి విశ్వాసాన్ని ఉంచండి. శిక్షణలో ఇదే అన్నింటికంటే తేలికైన మార్పు!!

✪